క్లుప్తంగా

దహెగాం తహసీల్దార్‌గా కవిత



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కవిత

దహెగాం: దహెగాం తహసీల్దార్‌గా శుక్రవారం కవిత బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల జిల్లా తాండూర్ నుంచి ఆమె బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ప్రహ్లాద్ స్థానంలో బాధ్యతలు తీసుకున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న పోలీసులు

బెజ్జూర్: పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు బాధిత కుటుంబానికి బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మండల కేంద్రానికి చెందిన బురసా ఎర్రయ్య భార్య మనస్తాపంతో ఆత్మహత్య చేసుకోగా, ఆరుగురు ఆడపిల్లలు ఉన్న బాధిత కుటుంబానికి పోలీసులు అండగా నిలిచారు. కార్యక్రమంలో ఎస్సై బి.విక్రమ్, ఏఎస్సై మోహన్ నాయక్, హెచ్‌జీ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్ల కలక మందులు పంపిణీ



మందులు పంపిణీ చేస్తున్న నాయకులు

వాంకిడి: వాంకిడి గ్రామ సర్పంచ్ బండె తుకారాం, ఉప సర్పంచ్ పవన్ సాయి స్థానికులకు శుక్రవారం కళ్ల కలక మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ అజయ్‌కుమార్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా కళ్ల కలక వ్యాధి విజృంభిస్తుందని, వ్యాధిని పూర్తిగా నివారించే ఉద్దేశంతో కంటి చుక్కల మందులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీవో శివకుమార్, పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



దహెగాంలో క్షీరాభిషేకం చేస్తున్న కృష్ణారావు

దహెగాం: రుణమాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో మండల కేంద్రంలో శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు పాల్గొని మాట్లాడారు. సాగు కోసం పెట్టుబడి సాయం అందించడంతో పాటు రుణమాఫీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, మండల రైతు బంధు సమితీ కన్వీనర్ సంతోష్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, సర్పంచ్ పాలె సుధాకర్, బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'హరితహారం'పై విద్యార్థుల ర్యాలీ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం మార్కెట్‌లో శుక్రవారం హరితహారం కార్యక్రమంపై శాంతినికేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఈజ్‌గాం ఎస్సై రమేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు పెంచాలన్నారు. కరస్పాండెంట్ మనీష్‌బరాయి, ప్రధానోపాధ్యాయులు డేవిడ్‌రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఆదివాసీల చైతన్య సభ

కౌటాల: మండల కేంద్రంలోని జగదాంబ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఆదివాసీల చైతన్యసభ నిర్వహించనున్నట్లు ఉట్నూర్ ఐటీడీఏ డైరెక్టర్ కుమురం మాంతయ్య శుక్రవారం తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆదివాసీలు చైతన్యం కలిగి ఉండాలన్నారు. రేపు మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే సభలో ఆదివాసీల సమస్యలు, ఎన్నికల్లో ఆదివాసీల బలంపై అవగాహన కల్పిస్తామన్నారు. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లోని ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజలు సభకు సకాలంలో అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

రెండు నెలలకే పగుళ్లు!

- నాణ్యతా ప్రమాణాలు గాలికి
- మూణ్నాళ్ల ముచ్చటగా రోడ్డు నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



పగుళ్లు తేలిన రోడ్డు

కౌటాల: మండల కేంద్రంలోని తలోడి చౌరస్తా నుంచి నాగేపల్లి చౌరస్తా వరకు వేసిన తారురోడ్డు రెండు నెలలకే పగుళ్లు తేలింది. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవంతో రోడ్డు పగిలిపోతోంది. ప్రధానమంత్రి గ్రామసడక్ యోజనలో భాగంగా తలోడి చౌరస్తా నుంచి నాగేపల్లి చౌరస్తా వరకు 2 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు మంజూరైంది. రూ.1.53 కోట్ల అంచనాల పనులను కాంట్రాక్టర్ దక్కించుకోగా గత ఫిబ్రవరి 15న రోడ్డు పనులు ప్రారంభించి జూన్ 15వ తేదీలోగా పూర్తి చేశారు.

పర్యవేక్షణ కరువు..

రోడ్డు నిర్మాణ పనులు జరిగే సమయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు లేకపోవడంతో సదరు కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పాటు క్వాలిటీ కంట్రోల్ శాఖ తనిఖీలు చేపట్టలేదు. నాసిరకం పనులకు తోడు భారీ కంకర లారీలు రాకపోకలు సాగించడంతో రహదారి మూణ్నాళ్ల ముచ్చటగా మారిందని స్థానికులు వాపోతున్నారు. కౌటాల -చింతలమానెపల్లి మండలాలకు ప్రధాన రహదారి ఇదే కావడంతో రోజూ వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు చోటు చేసుకోగా రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించడంతో ఇటీవల రోడ్డు పనులు పూర్తి చేశారు. ఈ రహదారి పనులు నాసిరకంగా చేపట్టడంతో పలుచోట్ల రహదారి కుంగిపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ధనుర్‌హెట్టి గ్రామ సమీపంలో పలుచోట్ల పగుళ్లు వచ్చి రోడ్డు ముక్కలవుతుండగా, మరికొన్ని చోట్ల అంచులు కోతకు గురవుతున్నాయి. రెండు నెలలకే రహదారి చెడిపోతుండడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాధనం వృథా..

ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నా క్షేత్రస్థాయిలో సక్రమంగా వినియోగించడం లేదు. నాసిరకం పనులతో నిర్మిస్తున్న రహదారులు నెలల వ్యవధిలోనే అధ్వానంగా మారుతున్నాయి. రూ.కోట్ల నిధులతో నిర్మించిన రహదారి మూడు నెలల లోపే పగుళ్లు తేలడంతో ప్రజాధనం దుర్వినియోగమవుతుందని స్థానికులు మండిపడుతున్నారు.

నిబంధనల ప్రకారమే పనులు

తలోడి చౌరస్తా నుంచి నాగేపల్లి చౌరస్తా వరకు రహదారి పనులు నిబంధనల ప్రకారమే నిర్వహించాం. రహదారి పనులు నిర్వహించిన మూడు సంవత్సరాల లోపు రహదారి నిర్మాణంలో లోపాలు తలెత్తితే గుత్తేదారు మరమ్మతులు చేపట్టాల్సి ఉంటుంది. రహదారిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- లక్ష్మీనారాయణ, ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారి

బడి తెరిచేది ఎప్పుడు..?



తిర్యాణి: మండలంలోని చోపిడి(తోయగూడ) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రెండు నెలలుగా విధులకు హాజరు కావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి చెందిన మరో వ్యక్తిని ప్రైవేట్‌గా నియమించగా సదరు వ్యక్తి సైతం విధులకు రాకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ఎంఈవో వెంకటేశ్వరస్వామిని వివరణ కోరగా ప్రైవేట్ వ్యక్తి బోధిస్తున్న విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఉపాధ్యాయురాలు ఎలాంటి సెలవులు తీసుకోలేదని తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'మన ఊరు- మన బడి' పనులు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

రెబ్బెన(ఆసిఫాబాద్): మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులన్నీ సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని రెబ్బెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతపెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించారు. రెబ్బెన జెడ్పీ హైస్కూల్‌లో శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను కూల్చివేసి వాటి స్థానంలో వంటగది నిర్మించాలన్నారు. పెంకుల పైకప్పు ఉన్న గదికి అవసరమైతే మరమ్మతులు చేపట్టి వంటగదిగా మార్చాలని ఏఈ ప్రవీణ్‌కుమార్‌కు సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరికొన్ని నల్లాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టే మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఎంపీడీవో శ్రీనివాస్‌కు సూచించారు. 40 రోజుల్లో అన్నిరకాల పనులు పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం పోతపెల్లి పాఠశాలను సందర్శించి, వంటగది, మరుగుదొడ్ల నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. సర్పంచులు ముందుకు రాని పక్షంలో ఇతరులకు పనులు అప్పగించాలన్నారు. నిర్మాణదారుకు బిల్లుల విషయంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

పారిశుధ్య సమస్యలు రానీయొద్దు

పారిశుధ్య సమస్యలు రానీయకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. రెబ్బెన, ఇందిరానగర్, మాద్వాయిగూడ, కొండపెల్లి, కైరిగాం పంచాయతీల్లో శుక్రవారం పర్యటించారు. కొండపల్లిలో శ్మశాన వాటిక, డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. ఆయన వెంట డీఈవో అశోక్, సెక్టోరియల్ అధికారి భరత్‌కుమార్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంఈవో వెంకటేశ్వర స్వామి, సర్పంచులు అహల్యాదేవి, రాజ్యలక్ష్మి, పార్వతి, శాంత, కార్తీక్, హెచ్‌ఎం మేడి చరణ్‌దాస్ పాల్గొన్నారు.

'చలో కాగజ్‌నగర్' విజయవంతం చేయండి

పెంచికల్‌పేట్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఈనెల 8న తలపెట్టిన చలో కాగజ్‌నగర్ సభకు మండలంలోని ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కాంబ్లె బాలాజీ మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీల్లోని 59 ఉపకులాలకు సమన్యాయం జరగాలంటే ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టాల్సిందేనన్నారు. జిల్లా కన్వీనర్ కొండ్ర బ్రహ్మయ్య, జిల్లా కోఆర్డినేటర్ పిట్టల సత్యనారాయణ, మండలాల అధ్యక్షులు ఇప్ప నగేష్, పెగడపల్లి తిరుపతి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రెబ్బెన: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన తక్కళ్లపల్లి సర్పంచ్ మడె శంకర్ కుటుంబానికి ఎమ్మెల్యే ఆత్రం సక్కు రూ. 10వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల ప్రజాప్రతినిధుల ద్వారా ఆర్థిక సాయాన్ని సర్పంచ్ భార్యకు అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, ఉప సర్పంచ్ మహేందర్, రెబ్బెన, రోళ్లపాడుల ఉప సర్పంచులు శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

'నామినేషన్లు పూర్తి చేయాలి'

కాగజ్‌నగర్‌రూరల్: ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్లకు సంబంధించిన నామినేషన్లు పూర్తి చేయాలని జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ అన్నారు. పట్టణంలోని డీఆర్‌సీ కార్యాలయంలో శుక్రవారం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు కార్యశాల నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులను నామినేషన్ చేయడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో భిక్షపతి, రిసోర్స్ పర్సన్‌లు తిరుపతయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాఫర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే నిధులు విడుదల చేయని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు సమీర్, నాందేవ్, తిరుపతి తదితరులు ఉన్నారు.

జోడేఘాట్ సందర్శన

కెరమెరి: మండలంలోని జోడేఘాట్ గ్రామాన్ని ట్రెజరీ జేడీ వీణ శుక్రవారం సందర్శించారు. భీం సమాధి వద్ద పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దల ద్వారా భీమ్ చరిత్ర తెలుసుకున్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉచిత వైద్య శిబిరం

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం షణ్ముఖ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు లక్ష్మీప్రసాద్, దివ్యలు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 170 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆర్ఎంపీ పీఎంపీల సంఘం గౌరవాధ్యక్షుడు లహాన్‌రాజ్, సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కుటుంబరావు

చింతలమానెపల్లి: గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి కుటుంబరావు అన్నారు. శుక్రవారం మండలంలోని బాలాజీ అనుకోడ రైతువేదికలో స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా గ్రామాల్లో చేపట్టిన మౌలిక వసతుల కల్పనపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ సభ్యులు ఎంపికైన పంచాయతీల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీలలో వాల్ పెయింటింగ్, మురుగు కాలువల పరిశుభ్రత, డంపింగ్ యార్డుల నిర్వహణ, పారిశుధ్య అంశాలను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలి



నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు, నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వం పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని పీడీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 120 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్నారన్నారు. జిల్లాలోని చాలా పాఠశాలల్లో సైతం ఇదే పరిస్థితి ఉందని విమర్శించారు. వెంటనే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వీవీల తోనైనా భర్తీ చేయాలన్నారు. అనంతరం నాయకులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట నిరసన తెలిపారు.

'జీపీ కార్మికులను పట్టించుకోని ప్రభుత్వం'



ఆసిఫాబాద్‌అర్బన్: మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామపంచాయతీ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మె శుక్రవారం 30వ రోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కార్మికుల దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. నాయకులు రమేశ్, వెంకన్న, పురాన్, సంజీవ్, తిరుపతి, సందీప్, బాపు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులపై ప్రభుత్వ మొండి వైఖరి సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఈనెల 10 నుంచి గ్రామాల్లో తాగునీరు, కరెంట్ పనులు సైతం నిలిపివేస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుధాకర్, రమేష్, వెంకటేష్, శ్రీనివాస్, ప్రకాశ్, శంకర్, సునీల్, లాల్‌సింగ్, సత్యనారాయణ, గోర్‌సింగ్, బాబాజీ, అన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్‌పల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం ప్రైవేట్ వ్యక్తులతో పారిశుధ్య పనులు నిర్వహిస్తుండగా గ్రామపంచాయతీ కార్మికులు వారిని అడ్డుకున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తుండగా అధికారులు ప్రైవేట్ వ్యక్తులతో పనులు చేయించడం సరికాదని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్ మద్దతు తెలిపారు. ఎంపీడీవో గౌరీశంకర్ గ్రామానికి వచ్చి కార్మికులతో మాట్లాడారు. కార్మికులు రమేశ్, సుధాకర్, ధర్మ, అఫీజ్, రఫియా, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 30వ రోజు కొనసాగింది. కార్మికులు నాగేశ్, కరుణాకర్, రాజారాం, కిష్టయ్య, భిక్షపతి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

పెంచికల్‌పేట్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈనెల 9న ఆదివాసీ గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ కోయసంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి సిడాం అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధనకు ప్రతీ ఒక్కరు కలిసి ముందుకు సాగాలన్నారు. ఆదివాసీల ఆత్మగౌరవ సాధనలో భాగంగా ప్రతీ గ్రామంలో జెండా ఎగురవేయాలని, ఆదివాసీ సాంప్రదాయాలతో దినోత్సవాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సకారాం, భుజంగరావు, శంకర్, మల్లేష్, లక్ష్మణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: బీఎస్పీ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఉత్తర తెలంగాణ చేరికల కమిటీ ఇన్‌చార్జి, సిర్పూర్ అసెంబ్లీ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

సంక్షిప్త వార్తలు

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

చింతలమానెపల్లి: పశువుల ఆరోగ్యంపై పశు యజమానులు శ్రద్ధ వహించాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. పశువైద్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బాలాజీ అనుకోడ, రుద్రాపూర్ గ్రామాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పశువైద్యాధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ మూడు నుంచి నాలుగు నెలల పైబడిన ఆవు, గేదెలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. సిబ్బంది సునీల్, కేశవ్, హరి, యశ్వంత్, పూర్ణచందర్‌లు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని గుండాయిపేటలో పశువులకు శుక్రవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సందీప్, రాజన్న, ప్రకాశ్, భిక్షపతి, శోభన్, నాయకులు దిలీప్, రైతులు పాల్గొన్నారు.

గంగాపూర్‌లో తల్లిపాల వారోత్సవాలు

రెబ్బెన: గంగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీటీసీ హరిత మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ, పోషణ అభియాన్ స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంగారిక చతుర్థి పూజలు

ఆసిఫాబాద్‌అర్బన్: అంగారిక చతుర్థి పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ గణపతి దేవాలయంలో అర్చకులు శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వినాయకునికి అభిషేకం, అష్టోత్తర శత నామావళి, ఏకదశ ఉపనిషత్తులు, పుష్పార్చన, మంగళహారతి, మహా మంత్రపుష్పాన్ని నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కాగజ్‌నగర్‌రూరల్: పేదలకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న మండలంలోని పలువురు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.10 కు చెందిన బిశ్వాస్‌విష్ణుకు రూ. 58,500, నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.9 గ్రామానికి చెందిన అజయ్‌కు రూ. 60వేలు, చారిగాం గ్రామానికి చెందిన లక్ష్మీబాయికి రూ. 29వేల చెక్కులు అందజేశారు. ఎంపీపీ శంకర్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు ఆదర్శవంతంగా ఉండాలి

చింతలమానెపల్లి: ఆటోస్టాండ్ల వద్ద ఆటోడ్రైవర్ల ప్రవర్తన ఆదర్శవంతంగా ఉండాలని ఎస్సై వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలన్నారు. తప్పనిసరిగా లైసెన్సు, సంబంధిత పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆటోల్లో అధికంగా శబ్దం వచ్చేలా ఏర్పాటు చేసిన మ్యూజిక్ సిస్టం తొలగించాలని హెచ్చరించారు.

జీఎంకు సన్మానం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రవిప్రసాద్‌ను శుక్రవారం ఏరియాకు చెందిన కార్మిక సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్ నాయకులు వేర్వేరుగా జీఎంను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు తిరుపతి, మొగిలి, జగ్గయ్య, చంద్రశేఖర్, కిరణ్, ఆనంద్, శ్రీనివాస్, హెచ్‌ఎంఎస్ నాయకులు రాజాబాబు, వజీర్, ఇనూస్, రమేష్, ఆరీఫ్, వశీం పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్‌ను కలిసిన రేషన్ డీలర్లు



అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న డీలర్లు

ఆసిఫాబాద్: జిల్లా అదనపు కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వేణును శుక్రవారం తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అదనపు కలెక్టర్ డీలర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవరావు, ప్రధాన కార్యదర్శి శేషగిరి రావు, ఉపాధ్యక్షుడు ఆత్మారాం, శంకరయ్య, ప్రకాశ్, రవి, అక్షిమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రధనస్సు.. కనులవిందు



కౌటాల: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం నీలాకాశంలో విరిసిన హరివిల్లు కనులవిందు చేసింది. కొన్ని నిమిషాల పాటు చూపరులను ఆకట్టుకోవడంతోపాటు ఆహ్లాదాన్ని పంచింది. పలువురు ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు.